క్లుప్తంగా

శాకంబరిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు


గోకవరంలో శాకంబరి అలంకారంలో దర్శన మిస్తున్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

గోకవరం: స్థానిక బత్తులవారి వీధిలో వేంచేసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు గురువారం శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం మహిళలు అమ్మవారిని వివిధ రకాల పండ్లు, కూరగాయలతో సుందరంగా అలంకరించారు. ఉదయం ఆలయ అర్చకుడు గణపతిశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు దేవీచౌక్ కనకదుర్గమ్మకు శాకంబరి అలంకారం

గోకవరంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ శుక్రవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. సుమారు 1000 కేజీల పండ్లు, కూరగాయలతో అమ్మవారిని అలంకరించనున్నట్టు ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ తెలిపారు.

ఘనంగా సత్యదేవుని నిత్యకల్యాణం


సత్యదేవుడు అమ్మవార్లకు కల్యాణం జరిపిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుడు, అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవార్ల నిత్యకల్యాణం గురువారం వైభవంగా జరిగింది. వందకు పైగా జంటలు ఈ కల్యాణంలో పాల్గొన్నాయి. ఉదయం 10.30 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా నిత్య కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. అక్కడ కల్యాణ వేదిక మీద ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం పండితులు యడవిల్లి వెంకటేశ్వరరావు, రవిశర్మ, అంగర సతీష్‌శర్మ, పాలంకి పట్టాభి తదితరులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం జరిపించారు. స్వామివారి కల్యాణాన్ని యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేశారు.

అభివృద్ధికి ప్రతిపక్షాలతో అవరోధం


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు జోగేశ్వరరావు

గోకవరం: గ్రామాభివృద్ధికి ప్రతిపక్షాలు అవరోధం కలిగిస్తున్నాయని కృష్ణునిపాలెం వైఎస్సార్ సీపీ నాయకుడు, గ్రామ సర్పంచ్ భర్త రౌతు జోగేశ్వరరావు ఆరోపించారు. గోకవరం ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఎస్టీ సబ్‌ప్లాన్ నుంచి పలు బోట్ల మంచినీటి ట్యాంకులు, రహదారులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు నిధులు మంజూరైనప్పటికీ ప్రతిపక్షానికి చెందిన పలువురు వార్డు సభ్యులు సంబంధిత పనులకు ఆమోదం ఇవ్వకుండా అభివృద్ధికి అడ్డుపడ్డారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా గ్రామ పంచాయతీకి ప్రత్యేక అధికారిని నియమించడంతో పనులకు మోక్షం కలిగిందన్నారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యురాలు తుర్రం సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకుడు అంబటి ప్రసన్న, ఇజ్జిన కిరణ్ పాల్గొన్నారు.

సిబ్బంది తొలగింపునకు నిరసనగా ధర్నా



ఏలేశ్వరం గురుకుల పాఠశాల వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ మహిళా సిబ్బంది తొలగింపును నిరసిస్తూ బుధవారం ధర్నా చేశారు. సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ 2019 నుంచి గురుకుల పాఠశాలలో ఆరుగురు మహిళలు కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారన్నారు. వీరికి అకారణంగా తొలగించడంతో జీవనోపాధి కోల్పోయారన్నారు. వెంటనే తొలగించిన వారికి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లోసూరి విజయ, దేవి, పాండ్రింకి వరలక్ష్మి, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

భూ లెక్క.. ఇక పక్కా

- సమగ్ర రీ–సర్వేతో భూ వివాదాలకు చెక్
- గ్రామాల్లో జోరుగా సర్వే
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు


భూ సరిహద్దుల్లో వేయటానికి సిద్ధం చేసిన సర్వే రాళ్లు

కిర్లంపూడి: గ్రామాల్లో దశాబ్దాల నుంచి ఉన్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా రెవెన్యూ అధికారులు ప్రతి గ్రామంలోనూ భూములను సర్వే చేసి సరిహద్దులు నిర్ణయిస్తున్నారు. సర్వే పూర్తయిన చోట రైతులకు భూహక్కు పత్రాలు మంజూరు చేస్తున్నారు.

చురుగ్గా సర్వే

ప్రస్తుతం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో భూముల రీ సర్వే జోరుగా సాగుతోంది. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్లు, ఓఆర్‌ఐ పరికరాల ద్వారా భూములను సర్వే చేస్తున్నారు. దీంతో సర్వే కచ్చితంగా, వేగంగా జరుగుతోంది. కిర్లంపూడి మండలంలో 17 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటిలోని ఐదు రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటికే సర్వే పూర్తయింది. మిగతా 12 రెవెన్యూ గ్రామాల్లో సర్వే చురుగ్గా సాగుతోంది.

ఐదుగురి సభ్యులతో బృందం

భూములను రీ సర్వే చేసేందుకు ఐదుగురితో కూడిన అధికారుల బృందం పని చేస్తోంది. వీఆర్వో, విలేజ్ సర్వేయర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్ డిజిటల్ అసిస్టెంట్ ఈ బృందంలో సభ్యులుగా ఉంటారు. సర్వే చేపట్టే ముందు రైతులకు ముందుగా సమాచారం ఇస్తారు. రైతులు తమ భూమికి సంబంధించిన పత్రాలను తీసుకువచ్చి, భూమిని చూపిస్తే అధికారులు సర్వే చేస్తారు. అక్షాంశాలు, రేఖాంశాలు ఆధారంగా భూమిని సర్వే చేసి ప్రతి కమతానికి ఒక నిర్దిష్టమైన యూనిక్ ఐడెంటిఫికేషన్ ద్వారా సర్వే నంబర్ ఇస్తున్నారు.

5 దశల్లో సర్వే

ఎటువంటి లోపాలు లేకుండా ఐదు దశల్లో భూముల రీ సర్వే ప్రక్రియను పూర్తి చేస్తారు. ఒకటో దశ గ్రౌండ్ ట్రూతింగ్, రెండో దశ గ్రౌండ్ వ్యాలిడేషన్, మూడో దశ విలేజ్ సర్వేయర్ లాగిన్, నాలుగో దశ వీఆర్వో లాగిన్, చివరిగా ఐదో దశ డీఎల్ఆర్, ఎంఆర్వో లాగిన్‌లో జరుగుతుంది. ఐదు దశలు పూర్తయిన తరువాత భూ వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తారు.

కిర్లంపూడి మండలంలో భూమి వివరాలు

భూమి రకం	ఎకరాల్లో
జిరాయితీ	11,524.35
పోరంబోకు	17,66.67
గ్రామ కంఠం	715.43
మొత్తం	14006.45

సర్వే మరింత వేగవంతం


భూముల రీ–సర్వేను మరింత వేగవంతం చేస్తున్నాం. ప్రతి గ్రామంలో రైతులకు సర్వేపై అవగాహన కల్పిస్తున్నాం. సర్వేకు రైతులు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారు. ఇప్పటివరకూ మండలంలోని ఐదు రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేశాం. మిగిలిన గ్రామాల్లో సర్వే త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాం.
–కేవీసీ మాధవరావు, తహసీల్దార్, కిర్లంపూడి

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం


ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేస్తున్న భూముల రీ సర్వేతో ఏళ్ల తరబడి ఉన్న సరిహద్దుల సమస్యలు తొలగిపోతున్నాయి. సర్వేతో రైతుల మధ్య ఉన్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తోంది. సుమారు 100 సంవత్సరాల తరువాత చేస్తున్న రీ సర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతోంది.
–తోట రవి, ఎంపీపీ, కిర్లంపూడి

నేడు కౌన్సిల్ సమావేశం

తుని: స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు గురువారం తెలిపారు. సమావేశపు హాలులో చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన జరిగే సమావేశంలో పట్టణాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చిస్తారన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

తుని: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయిల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ ఎన్.కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రయాణికులు తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు. ప్రయాణికులు 73827 81490 నంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలిపాలని కోరారు.

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ జి.సత్యనారాయణ గురువారం తెలిపారు. ప్రయాణికుల సమస్యల పరిష్కారంతో పాటు వారి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రయాణికులు 99592 25532 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పేదలకూ కార్పొరేట్ వైద్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- రాజపూడి పీహెచ్‌సీలో అదనపు భవనాలకు శంకుస్థాపన


రాజపూడి పీహెచ్‌సీలో అదనపు భవనాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: గ్రామాల్లోని పేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించే బ్లాక్ లెవెల్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నూతన భవనానికి గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్నిరకాల వసతులు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, సచివాలయాల మండల కన్వీనర్ బండారు రాజా, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వైఎస్సార్ సీపీ నేత సోమరాజు, ఏపీఎంఎస్ ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయభాస్కరరెడ్డి, ఎంపీడీఓ వసంత కుమార్, తహసీల్దార్ శ్రీదేవి, రాజపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి గౌతమి పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై ఇంటింటా ప్రచారం


కాకరాపల్లిలో సురక్ష యాప్‌లోని అంశాలపై మహిళలను ఆరా తీస్తున్న లంక ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దొరబాబు

కోటనందూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ అన్నారు. మండలంలోని కాకరాపల్లిలో గురువారం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లతో కలిసి జగనన్న సురక్షపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. సురక్ష యాప్‌లో ఉన్న అంశాలపై గ్రామస్తుల అభిప్రాయాన్ని కోరారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

గండేపల్లి: గ్రామాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీపీ చలగళ్ల దొరబాబు తెలిపారు. మండలంలోని నీలాద్రిరావుపేట సచివాలయంలో గురువారం జగనన్న సురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతు గ్రామాల్లో పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి సాయం అందించడమే సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. వలంటీర్లు, గృహసారథులు, అధికారులు సమన్వయంతో పని చేసి సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ తాళ్లూరి మధు, గ్రామ సర్పంచ్ ములంపాక సురేష్, సోడా అబ్బులు, తుపాకుల సత్తి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో గురువారం వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన పాదూరి ప్రవీణ్‌కుమార్ జ్ఞాపకార్థం తల్లి పాదూరి చిన్నారి, సోదరులు పాదూరి రాజ్‌కుమార్, ప్రసన్నకుమార్ ఆర్థిక సాయంతో నిర్వహిస్తున్న ఈ పోటీలను గ్రామ సర్పంచ్ పీతల నూకరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో సీహెచ్ నాని, టి.వెంకటేష్, పి.రాజు, బాబీ, జైభీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వాహనాల వేగం నియంత్రణకు చర్యలు


ఎ.కొత్తపల్లిలో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్లు

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లి మెయిన్ రోడ్డులో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఆర్ అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల గ్రామంలో లారీ ప్రమాదం జరిగిన నేపథ్యంలో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రహదారి వద్ద పీపాలు, బారికేడ్లను ఏర్పాటు చేశారు. గ్రామ శివారులో రెండు వైపులా వీటిని ఏర్పాటు చేయడంతో వాహనాలు తక్కువ వేగంతో మాత్రమే గ్రామంలో వెళ్తున్నాయి. ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు


తుని మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఏలేశ్వరం: పట్టణంలోని ముస్లింలు గురువారం బక్రీద్ పండగను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మార్కెట్ వీధిలోని మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ఇస్లాంలో రంజాన్ తరువాత అంతటి ప్రాముఖ్యం ఉన్న ఈదుల్ జుహాన్ను బక్రీద్‌గా భావిస్తామన్నారు. త్యాగానికి ప్రతీకగా బక్రీద్ జరుపుకుంటామని తెలిపారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

తుని: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకలు గురువారం పట్టణంలో ఘనంగా జరిగాయి. ముస్లింలు ఒకరినొకరు పరస్పరం ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. త్యాగానికి, స్ఫూర్తికి, అత్యున్నత భక్తి ప్రతీక బక్రీద్ అని మతపెద్దల బోధించారు. పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ప్రత్తిపాడు, ఒమ్మంగి, ధర్మవరం గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు నమాజు చేసి కుర్బానీ గొప్పదనాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేశారు.

కిర్లంపూడి: త్యాగం, స్ఫూర్తికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండగను గురువారం నియోజకవర్గంలోని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని మసీదులను సుందరంగా అలంకరించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ముస్లింలు మసీదులకు చేరుకుని ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. అనంతరం ఇళ్లకు వెళ్లి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఇబ్రహీం ప్రవక్త అల్లాపై చూపిన ప్రగాఢ విశ్వాసానికి, త్యాగానికి ప్రతీకగా ఏటా ఈ పండగ నిర్వహిస్తామని ముస్లిం మత పెద్దలు తెలిపారు.

సాయిబాబా డ్వాక్రా సంఘానికి అవార్డు


రాజమహేంద్రవరంలో అవార్డు అందుకుంటున్న సాయిబాబా డ్వాక్రా గ్రూపు సభ్యులు

గోకవరం: స్థానిక సాయిబాబా డ్వాక్రా గ్రూపు ఇండియన్ బ్యాంకు జోనల్ పరిధిలో ఉత్తమ మహిళా సంఘంగా ఎన్నికైంది. ఇండియన్ బ్యాంకు రాజమహేంద్రవరం రీజినల్ పరిధిలోని 65 బ్రాంచిల్లో 2022–23 సంవత్సరానికి గాను ఉత్తమ గ్రూపుగా నిలిచింది. ఈ సందర్భంగా గురువారం రాజమహేంద్రవరంలోని ఇండియన్ బ్యాంకు జోనల్ కార్యాలయంలో యానిమేటర్ కలవల కనకరత్నం, గ్రూపు ప్రెసిడెంట్ కణితి వీరవెంకట అమరవాణి, సెక్రటరీ కణితి పావనలక్ష్మీగాయత్రి, ఇతర సంఘం సభ్యులకు బ్యాంకు రీజినల్ మేనేజర్ పీఎస్ఎస్ సుధాకర్ అవార్డు అందజేశారు. అవార్డు పొందిన సాయిబాబా డ్వాక్రా గ్రూపు సభ్యులను ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.

అమ్మవారికి సారె సమర్పణ


ధర్మవరంలో కనకదుర్గమ్మ అమ్మవారికి సమర్పించేందుకు సారె, చీర తీసుకువెళుతున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో వేంచేసిన కనకదుర్గ అమ్మవారికి గురువారం సారె, చీర సమర్పించారు. గ్రామానికి చెందిన పసగడుగుల రాజేశ్వరి కుటుంబ సభ్యులు పలు రకాల స్వీట్లు, పండ్లతో మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని గ్రామంలో ఊరేగించి సారె సమర్పించారు. దారి పొడవునా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

276 మంది రైతుల భూముల్లో భూసార పరీక్షలు

శంఖవరం: మండల వ్యాప్తంగా 276 మంది రైతుల భూముల్లో భూసార పరీక్షలు చేసినట్లు మండల వ్యవసాయాధికారి పి.గాంధీ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మట్టి నమూనాలను సామర్లకోట మట్టి నమూనా పరీక్షా కేంద్రానికి పంపామన్నారు. భూసార పరీక్షల అనంతరం రైతులు ఆయా భూముల్లో ఏఏ పంటలు వేయాలో తెలియజేస్తామన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని దానికి అనువైన పంటలు వేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- గ్రామాల్లో ఉత్సాహంగా ఏకాహం


ఏలేశ్వరం సత్యనారాయణస్వామి ఆలయంలో పారాయణలు చేస్తున్న మహిళలు


టీజే నగరంలో వినాయకుడిని దర్శించుకుంటున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు


రత్నగిరిపై లేత తాటియాకులతో చేసిన వినాయకులు, పుష్పాలంకరణ


రత్నగిరిపై ధ్వజస్తంభానికి చేసిన పుష్పాలంకరణ

ఏలేశ్వరం: తొలి ఏకాదశి వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో గురువారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గ్రామాల్లో రామాలయాల్లో 24 గంటల పాటు ఏకాహం నిర్వహించారు. పట్టణంలోని నెయ్యిలపేట రామాలయం వద్ద వేంకటేశ్వరా ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏకాహం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధాంతపు రాజాగణేష్, పాండ్రింకి సత్తియ్య తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: తొలి ఏకాదశి సందర్భంగా టీజే నగరం వినాయకుడి ఆలయంలో ఏర్పాటు చేసిన ఏకాహాన్ని ఎంపీపీ లగుడు శ్రీనివాసు ప్రారంభించారు. తొలుత సర్పంచ్ సుర్ల రాంబాబుతో కలిసి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. వ్యవసాయ సలహా మండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు గిడుతూరి రాంబాబు, సుర్ల నాగేశ్వరరావు, సుర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత, విష్ణుసహస్రనామ పారాయణలు

ఏలేశ్వరం: తొలి ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం విష్ణుసహస్ర, భగవద్గీత, లక్ష్మీ అష్టోత్తర, లలితాసహస్రనామ పారాయణాలు చేశారు. విశ్వ హిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో పారాయణలు చేసి భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు ఏడీపీ ప్రసాద్, తూమురౌతు గురయ్య, సంఘ మహిళా సభ్యులు మల్లేశ్వరి, కల్యాణి, రమ్య, మంగామణి, కామాక్షి, రేవతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాహం

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లి రామాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా గురువారం ఏకాహం నిర్వహించారు. ఉదయం పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సర్పంచ్ ఈగల విజయదుర్గ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గండేపల్లి: తాళ్లూరులో వేంచేసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రత్నగిరిపై అలరించిన పుష్పాలంకరణ

అన్నవరం: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం రత్నగిరిపై సత్యదేవుని ఆలయంతో పాటు దర్బారు మండపం, ధ్వజస్తంభం తదితర చోట్ల చేసిన పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దర్బారు మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఆలయానికి ఇరువైపులా లేత తాటి ఆకులతో చేసిన వినాయక ప్రతిమలు అలరించాయి.

గృహ సారథి ఇన్‌చార్జ్‌ల నియామకం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వైఎస్సార్ సీపీ గృహ సారథి మండల ఇన్‌చార్జులను నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలిచ్చారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో

ప్రత్తిపాడు మండలానికి రామిశెట్టి చినబాబు, రౌతులపూడికి ఆర్.సూరిబాబు, శంఖవరం బి.లచ్చారావు, ఏలేశ్వరం మండలానికి ఎస్.చిన్నారావు, ఏలేశ్వరం నగర పంచాయతీకి ఎ.వీర రాఘవస్వామిని నియమించారు.

తుని నియోజకవర్గం

తుని మండలానికి సాకుర్రు నాగేంద్ర, తుని మున్సిపాలిటీకి పామర్తి మహేష్, కోటనందూరు లగుడు శ్రీనివాస్, తొండంగి మండలానికి నాగం గంగాధర్‌రావును నియమించారు.

జగ్గంపేట నియోజకవర్గం

గండేపల్లి మండలానికి తాళ్లూరు మణికుమార్, గోకవరం దాసరి రమేష్, జగ్గంపేట మండలానికి బండారు రాజా, కిర్లంపూడి మండలానికి పెనుగంటి రాజేష్‌ను నియమించారు.

నేడు పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు శంకుస్థాపన

కిర్లంపూడి: మండలంలోని గెద్దానాపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో నూతన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (ల్యాబ్) నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శంకుస్థాపన చేస్తారని ఎంపీపీ తోట రవి గురువారం తెలిపారు.